క్లుప్తంగా

సంగీతార్చనతో కృష్ణాష్టమి వేడుకలు


శ్రీకృష్ణుని చిత్రపటం వద్ద సంగీతార్చన చేస్తున్న విద్యార్థులు

విజయనగరం టౌన్: నగరంలోని కొత్త అగ్రహారంలో ఉన్న రోటరీ దశగి పేర్రాజు మ్యూజిక్ అకాడమీలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు సోమవారం సంగీతార్చనలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణుడి చిత్రపటానికి పూలతో అలంకరించి, పూజలు చేశారు. అకాడమీ ప్రిన్సిపాల్ డాక్టర్ మండపాక రవి కృష్ణాష్టమి విశిష్టతను విద్యార్థులకు వివరించారు. అధ్యాపకులు వంశీకృష్ణ, రవికుమార్, మహేశ్వరరావు, భానుహర్ష, శిరీష, శారద, బాలాజీస్వామి, నిర్మల, తదితరులు ప్రదర్శనలను పర్యవేక్షించారు. విద్యార్థులు అనన్య, సాహితీ, ప్రణతి, శ్రీనిధి, రమ్య, రాహిత్య, దేవవర్ధన్, సాయిజ్యోత్స్న, తనూజశ్రీ, నక్షత్ర, తదితరులు గాత్రం, వయోలిన్‌లో ప్రదర్శనలివ్వగా మహేశ్వరరావు మృదంగంపై సహకరించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, సంగీతాభిమానులు పాల్గొన్నారు.

అనుమతుల్లేకుండా విక్రయాలు తగదు..


షాపుల్లో తనిఖీలు చేస్తున్న ఎస్సై సన్యాసినాయుడు, సిబ్బంది


డెంకాడ: అనుమతుల్లేకుండా మందుగుండు సామగ్రి విక్రయిస్తే చర్యలు తప్పవని ఎస్సై ఎ.సన్యాసినాయుడు అన్నారు. మండలంలోని అయినాడ జంక్షన్, జొన్నాడ ప్రాంతాల్లో సిబ్బందితో కలిసి సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గంజాయి, గుట్కాలు వంటి నిషేధిత పదార్థాలను విక్రమించినా, రవాణా చేసినా.. మందుగుండు విక్రయించినా చట్టపరంగా చర్యలు తీసుకుంటానని చెప్పారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన చర్యలు తప్పవన్నారు. అనంతరం నిబంధనలు పాటించని వాహనదారులకు ఈ చలాన్‌లు విధించారు.

వరుణుడి కరుణ కోసం పూజలు


గంగమ్మకు పూజలు చేసేందుకు బిందెలతో నీటిని తెచ్చిన మహిళలు

బొండపల్లి: వరుణ దేవుడు కరుణించి వర్షాలు సమృద్ధిగా కురవాలని వేడుకుంటూ మండలంలోని గిట్టుపల్లి గ్రామస్తులు సోమవారం పూజలు చేశారు. ప్రతీ ఇంటి నుంచి మహిళలు పసుపు, కుంకుమ కలిపిన నీటిని బిందెలతో రామాలయానికి తీసుకుని వచ్చి గంగమ్మ తల్లికి పూజలు చేశారు. వర్షాలు లేక వరినాట్లు ఎండిపోతున్నాయని, వరుణ దేవుడి అనుగ్రహం కోసం పూజలు చేశామని గ్రామస్తులు తెలిపారు.

మట్టి గణపతినే పూజిద్దాం


మట్టి వినాయక విగ్రహాలను ప్రదర్శిస్తున్న ఆశయ, నవభారత్ సంస్థల ప్రతినిధులు

చీపురుపల్లి: వినాయక చవితి పండగను పురస్కరించుకుని మట్టి గణపతినే పూజించాలని ఆశయ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి రమణ కోరారు. పట్టణంలో సోమవారం ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఆశయ యూత్ అసోసియేషన్, నవభారత్ ఫౌండేషన్ సంయుక్తంగా మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ కోసం ఏటా వినాయక చవితికి మట్టి ప్రతిమలు పంపిణీ చేస్తున్నామని చెప్పారు.నవభారత్ ఫౌండేషన్ అధ్యక్షుడు యు.హరి, సంస్థ ప్రతినిధులు టి.త్రినాథ్, జి.శ్రీను, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపిక


వరప్రసాద్

శృంగవరపుకోట: మండలంలోని ధర్మవరం ఉన్నత పాఠశాల విద్యార్థి వెదురుపర్తి వరప్రసాద్ ట్రిపుల్ ఐటీలో సీటు సాధించాడని హెచ్‌ఎం ఉమామహేశ్వరరావు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పదో తరగతిలో 565 మార్కులు సాధించిన వరప్రసాద్ మూడో విడతలో భర్తీ చేసిన సీట్లలో ఒంగోలు ట్రిపుల్ ఐటీలో ప్రవేశానికి అర్హత సాధించాడన్నారు. తమ పాఠశాలలో వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన ముగ్గురు విద్యార్థులకే వేర్వేరు ఐఐఐటీల్లో సీట్లు సాధించడం ఆనందంగా ఉందన్నారు.



రక్షణ చట్టాలు అవసరం..

వైద్యుల శ్రేయస్సు కోసం వారి భద్రత కోసం సుప్రీంకోర్టు ప్రభుత్వానికి గైడెన్స్ ఇవ్వడం హర్షించదగ్గ విషయం. ప్రజా సేవలో ఉన్న వైద్యులపై అనేకచోట్ల దాడులు జరుగుతున్నాయి. ఈ దాడులు ఆగాలంటే రక్షణ చట్టాలు అవసరం. ప్రజల్లో కూడా చైతన్యం రావాలి. ప్రతి విషయానికీ అతిగా స్పందించి దాడులకు పాల్పడుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకుంటే అవాంఛనీయ సంఘటనలు జరగడానికి అవకాశం ఉండదు.

– డాక్టర్ గౌతమ్, భోగాపురం, సీహెచ్‌సీ



భయమేస్తోంది..

కోల్‌కతాలో చోటుచేసుకున్న సంఘటనతో భయమేస్తోంది. వెలుగులోకి వస్తున్న నిజాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇప్పుడిప్పుడే విద్యార్థినులు ధైర్యంగా ముందుకు వచ్చి పీజీ చదువుకుంటున్నారు. ఇలాంటి సంఘటనలతో మళ్లీ ఇళ్లకే పరిమితమయ్యే పరిస్థితులు ఏర్పడతాయి. ప్రభుత్వాలు నిందితుడితో పాటు కారణమైన ప్రతి ఒక్కరినీ కఠినంగా శిక్షించాలి.

– డాక్టర్ రమ్య, భోగాపురం



శ్రీకృష్ణుడు సర్వ మానవాళికి ఆదర్శప్రాయుడు..


విజయనగరం టౌన్: బ్రహ్మకుమారీస్ కేంద్రంలో శ్రీకృష్ణ జన్మాష్టమి విశిష్టతను తెలియజేస్తున్న బ్రహ్మకుమారీస్ జిల్లా ఇన్‌చార్జ్ రాజయోగిని అన్నపూర్ణ


డెంకాడ : కృష్ణాష్టమి వేడుకల్లో ఉట్టి కొడుతున్న యువకుడు

చేసిన కర్మలకు ప్రతిఫలం అనుభవించక తప్పదని.. ప్రతి ఒక్కరూ తమ అంతరాత్మ ప్రకారం నడుచుకోవాలని లోకానికి చాటిచెప్పిన శ్రీకృష్ణ మహాప్రభువు సర్వ మానవాళికి ఆదర్శప్రాయుడు. అటువంటి దేవదేవుడి జన్మాష్టమిని వాడవాడలా ఘనంగా జరుపుకున్నారు. సోమవారం వేకువ జామునుంచే ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. యువత సాయంత్రం వేళ ఉట్టికొట్టే సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. తల్లిదండ్రులు తమ చిన్నారులను రాధాకృష్ణులుగా అలంకరించి.. ఆ దేవుడే తమ ఇంట సందడి చేస్తున్నాడని సంబరపడిపోయారు. బ్రహ్మకుమారీస్ కేంద్రాల్లో ఆధ్యాత్మిక ప్రవచనాలు ఏర్పాటు చేయగా.. పలు చోట్ల ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

– విజయనగరం / నెల్లిమర్ల నెట్‌వర్క్


విజయనగరం ఫోర్ట్: తోటపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో శ్రీకృష్ణుడు, సత్యభామ వేషధారణతో ఉన్న చిన్నారులు


విజయనగరం: చిక్కాలవీధి రామమందిరంలో నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకల్లో మేయర్ విజయలక్ష్మి, తదితరులు


విజయనగరం ఫొటోగ్రాఫర్: వీటీ అగ్రహారంలో ఉట్టికి హారతులు ఇస్తున్న స్థానికులు


విజయనగరం ఫొటోగ్రాఫర్: చిన్నారితో ఉట్టి కొట్టిస్తున్న స్థానికులు


పూసపాటిరేగ: కృష్ణుడు వేషధారణలో చిన్నారి


పూసపాటిరేగ: గోపిక వేషధారణలో చిన్నారి

ఉద్యానవన పంటలతో లాభాలు..

- ఉపాధి హామీ పథకంలో భాగంగా 257 ఎకరాల్లో తోటల పెంపకానికి ప్రణాళికలు
- ఉద్యానవన సాగు కింద రైతులకు చేయూత
- 55 ఎకరాల్లో ప్లాంటేషన్ పూర్తి చేసిన అధికారులు


ఉపాధిహామీ పథకంలో భాగంగా వేసిన కొబ్బరి

పూసపాటిరేగ: సన్న, చిన్నకారు రైతులకు నిత్య ఆదాయం వచ్చేలా ఉపాధి హామీ పథకం ద్వారా ఉద్యానవన తోటల సాగును కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. మొక్కలు ఉచితంగా ఇవ్వడంతో పాటు ప్లాంటేషన్, నీటి సరఫరా, మూడేళ్లు పాటు నిర్వహణ ఖర్చును పూర్తిగా కేంద్ర ప్రభుత్వమే భరిస్తుంది. ఐదేళ్ల పాటు మొక్కలను కాపాడుకుంటే నిత్యం ఆదాయం సమకూరుతోందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పూసపాటిరేగ మండల పరిధిలో పలు గ్రామాలలో కొబ్బరి, మామిడి తోటలు పెంపకానికి రైతులు ముందుకు వస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉపాధి జాబ్‌కార్డు కలిగి ఉండి ఐదు ఎకరాల్లోపున్న సన్న, చిన్నకారు రైతులు తోటల పెంపకం పథకానికి అర్హులు. మండలంలో 257 ఎకరాల్లో ప్లాంటేషన్‌కు రైతుల నుంచి ప్రతిపాదనలు వచ్చినప్పటికీ, తొలి విడతగా 55 ఎకరాల్లో మొక్కలు వేసేందుకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. నిర్దేశించిన లక్ష్యం మేరకు 55 ఎకరాల్లో ప్లాంటేషన్ పూర్తియినట్లు అధికారులు తెలిపారు. వర్షాకాలం కావడంతో మరింత మంది రైతులు ఉద్యానవన మొక్కల పెంపకానికి ముందుకు వస్తున్నారు.

80 మొక్కలు వేశాను..

ఉపాధిహామీ పథకం ద్వారా ఎకరం పొలంలో 80 కొబ్బరి మొక్కలు వేశాను. మూడేళ్ల పాటు నిర్వహణ ఖర్చు అంతా ప్రభుత్వమే భరించింది. ఐదేళ్ల తర్వాత ఫలసాయం చేతికి అందనుంది. కొబ్బరిలో అంతర పంటలు వేసినట్లయితే మరంత లాభసాటిగా ఉంటుంది.

– పి.నారాయణ, రైతు, పతివాడ

సద్వినియోగం చేసుకోవాలి..



ఉద్యానవన తోటలైన కొబ్బరి, జీడిమామిడి సాగులో స్థిరంగా ఆదాయం వస్తుంది. ఉపాధిహామీ పథకం ద్వారా తోటల నిర్వహణకు నిధులు మంజూరవుతాయి. ఇప్పటికే మండల పరిధిలో 55 ఎకరాల్లో ఉద్యానవనతోటల నిర్వహణకు నిధులు మంజూరు చేశాం. భూమి ఉన్న చిన్న, సన్నకారు రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– రత్నమాల, ఉపాధి ఏపీఓ, పూసపాటిరేగ

పాత పెన్షన్ అమలు చేయాలి



మాట్లాడుతున్న విద్యా సంఘాల సమాఖ్య (ఏఐఎఫ్‌ఈఈ) ఉపాధ్యక్షుడు వై.సత్యం

- ఏపీటీఎఫ్ జిల్లా కమిటీ డిమాండ్

విజయనగరం అర్బన్: కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన ఏకీకృత పింఛన్ విధానాన్ని (యూపీఎస్) ఏపీటీఎఫ్ సంఘం వ్యతిరేకిస్తోందని విద్యా సంఘాల సమాఖ్య (ఏఐఎఫ్‌ఈఈ) ఉపాధ్యక్షుడు వై.సత్యం అన్నారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల ప్రమాణాలపై ప్రభావం చూపుతున్న జీఓ 117ను రద్దు చేయాలన్నారు. ప్రాథమిక పాఠశాలలు 1 నుంచి 5వ తరగతి వరకు.. ఉన్నత పాఠశాలలు ఆరు నుంచి పదో తరగతి వరకు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సంఘ జిల్లా అధ్యక్షుడు ఎం.బలరాంనాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌వీ పైడిరాజు, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎ.సదాశివరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.ఈశ్వరరావు, ఆర్.కృష్ణ, ఎంవీ రమణ, ఏవీ శ్రీనివాసరావు, డి.వెంకటనాయుడు, సీహెచ్.వెంకటరమణ, ఎస్. శ్రీదేవి, పి.బాబులాల్, చినసత్యనారాయణ, సీహెచ్‌వీఎస్ఎస్ మూర్తి, గంట సత్యనారాయణ, పి. దామోదరనాయుడు, బి.శరత్‌కుమార్, సత్యారావు, రామారావు వివిధ మండల కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి


సీఐ సతీష్‌కుమార్‌కు జ్ఞాపిక బహూకరిస్తున్న వీరబొబ్బిలి స్పోర్ట్స్ క్లబ్ నిర్వాహకులు

బొబ్బిలి: విద్యార్థి దశ నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సీఐ కె.సతీష్‌కుమార్ సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయనను వీరబొబ్బిలి స్పోర్ట్స్ క్లబ్ నిర్వాహకులు రావు శ్రీనివాసరావు, తదితరులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన అక్కడికి వచ్చిన క్రీడాకారులకు పలు సూచనలు చేశారు. క్రీడలతో ఉజ్వల భవిష్యత్ అని, క్రీడల్లో రాణించిన ఎంతోమంది ఇప్పుడు ఉన్నత స్థానాల్లో ఉన్నారని తెలిపారు. నచ్చిన క్రీడలో నైపుణ్యం సాధించి, తద్వారా జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో రాణించి గుర్తింపు సాధించాలని ఆకాంక్షించారు. స్పోర్ట్స్ కోటాలో ఉన్నత విద్యనభ్యసించేందుకు సీట్లు, ఉద్యోగాలు కూడా వస్తున్నాయన్న విషయం మర్చిపోవద్దన్నారు.

పశువులకు వ్యాక్సినేషన్


మురపాకలో పశువులకు టీకాలు వేస్తున్న పశు సంవర్ధకశాఖ సిబ్బంది

గంట్యాడ: మండలంలోని పెదమజ్జిపాలెం, మురపాక గ్రామాల్లో పశువులకు పశుసంవర్ధక శాఖ సిబ్బంది సోమవారం లికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. పశుపోషణలో పాటించాల్సిన జాగ్రత్తలపై పాడిరైతులకు సూచనలు చేశా రు. వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పశుసంవర్ధకశాఖ ఏడీ రెడ్డి కృష్ణ పరిశీలించారు. పాడి రైతులంతా తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని సూచించారు.

ఎమ్మెల్సీ బొత్సకు శుభాకాంక్షలు


ఎమ్మెల్సీ బొత్సను కలిసిన వేపాడ మండల వైఎస్సార్‌సీపీ నాయకులు

వేపాడ: ఉమ్మడి విశాఖపట్నం జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణను వేపాడ మండల వైఎస్సార్‌సీపీ నాయకులు విశాఖలో సోమ వారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బొత్సను కలిసిన వారిలో నాయకులు వంటాకు భాస్కర్, ఆదపురెడ్డి ముత్యాలునాయుడు, మిరపాక రమణ, బోజంకి నారాయణమూర్తి తదితరులు ఉన్నారు.

అందరి సహకారంతో పరిశుభ్ర నగరం


స్వీపింగ్ వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న మంత్రి కొండపల్లి, ఎమ్మెల్యే అదితిగజపతిరాజు

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్
- కార్పొరేషన్ పరిధిలో రెండు స్వీపింగ్ వాహనాలు ప్రారంభం

విజయనగరం: అందరి సహకారంతో ఆరోగ్యకరమైన, పరిశుభ్ర నగరంగా విజయనగరాన్ని తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్‌లో పారిశుధ్య నిర్వహణ కోసం నూతనంగా ఏర్పాటు చేసిన రెండు స్వీపింగ్ వాహనాలను స్థానిక ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతిరాజుతో కలిసి సోమవారం ఉదయం ఆయన ప్రారంభించారు. అంతకుముందు పైడితల్లి ఆలయ అభివృద్ధి పనులపై అధికారులతో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నగరాన్ని పారిశుధ్యపరంగా మరింత మెరుగుపరిచేందుకు రెండు స్వీపింగ్ వాహనాలను ప్రారంభించినట్లు తెలిపారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నేతృత్వంలో ఆధునిక పద్ధతిలో పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే ఉత్తరాంధ్రుల కల్పవల్లి పైడితల్లి ఆలయ అభివృద్ధికి ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఈ ఏడాది ఉత్సవం అంగరంగవైభవంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు, ప్రజారోగ్య అధికారి కొండపల్లి సాంబమూర్తి, టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, కనకల మురళీమోహన్, అవనాపు విజయ్, కంది మురళీనాయుడు, ప్రసాదుల లక్ష్మీవరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామానికి 30 నిమిషాలు తప్పనిసరి


ఫిట్ ఇండియాపై క్రీడాకారులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్‌డీఓ వెంకటేశ్వరరావు

- జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి వెంకటేశ్వరరావు

విజయనగరం: ప్రతిరోజూ ఒక వ్యక్తి 30 నిమిషాల సమయాన్ని వ్యాయామం కోసం కేటాయించి ఫిట్ ఇండియా సాధనలో భాగస్వాములు కావాలని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి ఎస్.వెంకటేశ్వరరావు సూచించారు. ఈ నెల 29న హాకీ లెజెండ్, మేజర్ ధ్యాన్‌చంద్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించనున్న జాతీయ క్రీడా దినోత్సవంలో భాగంగా శాప్ ఆదేశాల మేరకు సోమవారం జిల్లాలోని అన్ని పాఠశాలలు, కళాశాలలు, క్రీడా వికాస కేంద్రాల్లో డీఎస్‌ఏ ఆధ్వర్యంలో ఫిట్ ఇండియా ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. నగరంలోని రాజీవ్ క్రీడామైదానంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న క్రీడాకారులతో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి వెంకటేశ్వరరావు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో బాక్సింగ్ కోచ్ ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

షటిల్ బ్యాడ్మింటన్ విజేత 'రేగిడి'


ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన వారితో యూటీఎఫ్ నాయకులు

రాజాం సిటీ: యూటీఎఫ్ స్వర్ణోత్సవాల్లో భాగంగా ఉపాధ్యాయుల మధ్య నిర్వహించిన షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతగా రేగిడి ఉపాధ్యాయుల జట్టు నిలిచింది. స్థానిక జీఎంఆర్ ఐటీ ఇండోర్ స్టేడియంలో సోమవారం జరిగిన నియోజకవర్గ స్థాయి పోటీలను వైద్యుడు గార రవిప్రసాద్ ప్రారంభించారు. రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాలకు చెందిన మొత్తం 32 జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. ఈ పోటీలో రేగిడి మండలానికి చెందిన వై.కిశోర్, వి.సత్యంనాయుడులు ప్రథమ స్థానంలో, జి.సింహాచలం, కె.హరిబాబులు ద్వితీయ స్థానంలో నిలిచారని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పి.వాసు తెలిపారు.